క్లుప్తంగా

నిత్యావసరాల అందజేత



దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌లో యూనివర్సల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మోపూరి వెంకటేశ్వరరావు సుమారు 30 మంది దివ్యాంగులకు బుధ వారం నిత్యావసరాలు, కూరగాయల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు నరవరాజు, దాతలు ప్రవీణ్‌రెడ్డి, మేరీలను దివ్యాంగులు సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, ఉషోదయ మండల దివ్యాంగుల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాన్ని పునర్నిర్మించాలి

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు శివారు శ్రీరంగనాయకపురం గ్రామంలో శిథిలస్థితికి చేరుకున్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని పునర్నిర్మించాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో భవనంపై వర్షం నీరు నిలిచిపోయి, భవనం పెచ్చులూడి పిల్లలపై పడుతున్నాయంటున్నారు. చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఉప్పలగుప్తం: ది ఉప్పలగుప్తం ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక మండలంలో గొల్లవిల్లి గ్రామంలో బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా పోతుమూడి కొండబాబు, ఉపాధ్యక్షుడిగా ఆకుల ప్రసాద్, ట్రెజరర్‌గా పందు రమేష్, కార్యదర్శిగా మహాదశ వీరబాబు, సహ కార్యదర్శిగా గొలకోటి రాములను యూనియన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొండబాబు మాట్లాడుతూ యూనియన్ సభ్యులంతా ఐక్యతతో మెలగాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

రాష్ట్ర పురోహిత సమాఖ్య అధికార ప్రతినిధిగా నాగాభట్ల



రవిశర్మ

ఐ.పోలవరం: రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధిగా మురమళ్ల గ్రామానికి చెందిన నాగాభట్ల రవిశర్మ మూడోసారి నియమితులయ్యారు. విశాఖపట్టణం శిల్పారామంలో బుధవారం పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, అధ్యక్షుడు పాదిల నారాయణమూర్తిల చేతుల మీదుగా రవిశర్మ నియామక పత్రం అందుకున్నారు.

స్టీలు కంచాలు, మిక్సీ, కుక్కర్ల బహూకరణ

అమలాపురం రూరల్: జనుపల్లి ప్రాథమిక పాఠశాలలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కోసం ఎస్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు నల్లా అజయ్, సభ్యుడు అడపా ప్రకాష్ రూ.9 వేల విలువైన 30 స్టీలు కంచాలు, మిక్సీ, కుక్కర్లు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గానాల భారతి, ఎంపీటీసీ పోలిశెట్టి దేవి, గానాల వెంకటేశ్వరావు, పొలిశెట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

అమలాపురం టౌన్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, చమురు సంస్థల ద్వారా నిధులను సాధించి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ తొలి సమావేశం ఆస్పత్రిలో బుధవారం జరిగింది. ఆస్పత్రి పైఅంతస్తు పూర్తి స్థాయిలో అందుబాటులో వస్తే ఆస్పత్రిలో బెడ్‌ల కొరత తీరుతుందని ఎమ్మెల్యేను సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు కోరారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ కుమార్, డాక్టర్ సౌమ్య, కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్మించనున్న అన్నా క్యాంటీన్‌కు ఎమ్మెల్యే ఆనందరావు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్లు యండమూరి గంగ, చిట్టూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల అందజేత

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్కూల్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. విద్యను ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత, మాజీ జెడ్పీటీసీ చింతా శంకరమూర్తి, మల్లుల పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల కన్నీటి గోదారి

- గోదావరి వరద, భారీ వర్షాలతో లంక గ్రామాలు అతలాకుతలం
- ముంపుబారిన పడి కుళ్లిపోతున్న వరి నాట్లు, ఉద్యాన పంటలు
- కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు



కొత్తలంకలో నీట మునిగిన వంగ తోట



సుంకరపాలెంలో కుళ్లిపోయిన వరినాట్లను చూపుతున్న రైతులు

తాళ్లరేవు: గోదావరి వరద లంక గ్రామాలను అతలాకుతలం చేసింది. వరి పొలాలను, ఉద్యాన పంటలను ముంచెత్తింది. గత 20 రోజులుగా ముంపులోనే ఉండిపోయిన ఆయా పంటలన్నీ కళ్ల ముందే కుళ్లి పాడైపోతుంటే అన్నదాత కన్నీరుమున్నీరవుతున్నాడు. ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టినా ఇప్పటికీ లంక గ్రామాలను ముంపు వీడలేదు. దిక్కుతోచని స్థితిలో ఉన్న లంక గ్రామాల ప్రజల ఆవేదనపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

ఈ ఏడాది తొలకరి సాగు ప్రారంభంలోనే అటు వరుణుడు, ఇటు గోదారమ్మ ఉగ్రరూపం దాల్చడంతో అన్నదాతలకు కష్టాలు మొదలయ్యాయి. గత 20 రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో పాటు గోదావరి వరదలతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా అధిక వర్షాల కారణంగా వరినాట్లు కుళ్లిపోయి పాడైపోతున్నాయి. వెదజల్లిన వరిచేలు సైతం మొలకలు రాక ఏంచేయాలో తెలియని పరిస్థితుల్లో రైతులు తలలు పట్టుకుంటున్నారు. గోదావరి వరద నీరు రోజురోజుకీ దిగువకు పరవళ్లు తొక్కుతూ వస్తుండడంతో పంటలు వేసిన రైతుల గుండెలు గోదావరవుతున్నాయి. ధవళేశ్వరం నుంచి తీర ప్రాంతానికి వస్తున్న వరద నీటి ప్రభావంతో లంక గ్రామాల్లో పంటలు రోజుల తరబడి నీటిలో నానుతూ కుళ్లిపోతున్నాయని అన్నదాతలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటి ప్రవాహం తగ్గినా ధవళేశ్వరం నుంచి వస్తున్న మిగులు జలాల కారణంగా లంక గ్రామాలను ముంపు వీడడం లేదు.

నేలమట్టమైన ఉద్యాన పంటలు

వరద కారణంగా లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు నేలమట్టమయ్యాయి. ప్రధానంగా లంక గ్రామాల్లో అధికంగా పండించే వంగ, బెండ, బీర, టమాటా, అరటి, బొప్పాయి, మునగ తదితర పంటలు పూర్తిగా నీటమునిగాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

పంట చేతికి వచ్చే సమయంలో ఏటా వరదలు వచ్చి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. గత 20 రోజులుగా నిరంతరాయంగా వర్షం పడడం, గోదావరి వరదల నేపథ్యంలో పంట కాలువల్లో నీరు అధికంగా ఉండడంతో వరిచేలల్లో నీరు బయటకుపోయే అవకాశం లేక వరిచేలు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేలల్లో మోకాళ్లోతు నీరు నిల్వ ఉండిపోవడంతో వరినాట్లు కుళ్లిపోతున్నాయని, మళ్లీ విత్తనాలు చల్లినా మొలకలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటేనే తప్ప కోలుకునే పరిస్థితులు లేవని, తక్షణమే అధికారులు పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వ సాయాన్ని అందించాలని వేడుకుంటున్నారు.

వరి పంట సాగు వివరాలు

నియోజకవర్గం	వరి సాగు (ఎకరాల్లో)	ముంపునకు గురైంది (ఎకరాల్లో)
అమలాపురం	18,000	3,200
ముమ్మిడివరం	32,000	5,000

ఉద్యాన పంటల సాగు ఇలా..

నియోజకవర్గం	వరి సాగు (ఎకరాల్లో)	ముంపునకు గురైంది (ఎకరాల్లో)
అమలాపురం	2,800	500
ముమ్మిడివరం	3,200	800

రెండోసారి విత్తనాలు జల్లినా



గోదావరి వరద, అధిక వర్షాల కారణంగా మొదట వేసిన వరి పంట పూర్తిగా పాడైపోయింది. తిరిగి రెండో సారి విత్తనాలు వెదజల్లాను. అయితే గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి చేలో మొలకలు కనిపించడం లేదు. ఇప్పుడు ఏం చేయాలో తెలియడం లేదు.

– కాదా రామకృష్ణ, రైతు, తాళ్లరేవు

వరద నీటిలో పంటలు కుళ్లిపోయాయి



ఈ ఏడాది గోదావరి వరద రైతులను తీవ్రంగా నష్టపరిచింది. ఎన్నో ఆశలతో సాగు చేసిన ఉద్యాన పంటలు గోదావరి వరద కారణంగా కుళ్లి పాడైపోయాయి. ఎకరాకు రూ.20 వేలకు పైగా ఖర్చయ్యింది. ఒక్క రూపాయి కూడా చేతికి రాలేదు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– దుక్కిపాటి శ్రీను, రైతు, కొత్తలంక

ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలి



రైతులు ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చు చేసి వేసిన వరినాట్లు భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్నాయి. చాలాచోట్ల రైతులు రెండోసారి విత్తనాలు వెదజల్లినా మొలకలు రావడం లేదు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.15 వేలు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– వల్లు రాజబాబు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

మమ్మల్ని పట్టించుకోరా?



ముంపు నీటిలో రాకపోకలు సాగిస్తున్న కంసాలమామిడి కాలనీ ప్రజలు



కంసాలమామిడిలో వరద ముంపులో బాధితుల ఇళ్లు

- పది రోజులుగా వరద ముంపులోనే కంసాలమామిడి, న్యూకాలనీలు
- తమకు ఎలాంటి సాయం చేయలేదంటూ స్థానిక మహిళల మండిపాటు

అల్లవరం: వరద ప్రభావంతో గత పది రోజులుగా ముంపులోనే జీవనం సాగిస్తున్న తమ 70 కుటుంబాలను పట్టించుకోకపోవడం దారుణమని బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని కంసాలమామిడి, న్యూకాలనీలకు చెందిన మహిళలు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. మోకాళ్ల లోతు ముంపు నీటిలో ఇళ్లు మునిగిపోయి రాకపోకలకు అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు తమను పట్టించుకోలేదని మండిపడ్డారు. వరద కారణంగా బోడసకుర్రు పల్లిపాలెంలో 91 కుటుంబాలు వరద ప్రభావానికి గురైతే 335 కుటుంబాల వారికి పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి వారం రోజులుగా భోజనాలు అందించారన్నారు. పది రోజులుగా వరద ముంపులో ఉన్న తాము మాత్రం అధికారుల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వరద బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయంగా అందించిన 25 కేజీల బియ్యం, నూనె, ఉల్లిపాయలు సైతం తమకు ఇవ్వలేదన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనైతే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వరదల సమయంలో వలంటీర్ల ద్వారా రెండు పూటల భోజనాలు అందిస్తూ ఆలనాపాలనా చూశారని, ముంపులో చిక్కుకున్న కుటుంబాలకు రూ.2 వేలు చొప్పున పరిహారం పంపిణీ చేశారని స్థానిక మహిళలు తెలిపారు. ప్రస్తుతం అధికారులు, ప్రజా ప్రతినిధులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని బొంతు అలివేలు మంగ, చింతా నాగవేణి, ముత్తాబత్తుల నాగసత్యవతి, నాగాబత్తుల దుర్గ, బొంతు మంగాయమ్మ, విజయ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి

అమలాపురం రూరల్: గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్పీఓ బొజ్జిరాజు ఆదేశించారు. మండలంలోని పేరూరు గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి సర్పంచ్ దాసరి అరుణ, కార్యదర్శి సూరపరాజు ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

మంత్రిత్వ శాఖల్లో మార్పులు

యానాం: పుదుచ్చేరిలో కేబినెట్ మంత్రులు నిర్వహిస్తున్న శాఖలను మారుస్తూ ఎల్జీ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌చౌహాన్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మంత్రి సాయి జె.శర్వణన్‌కుమార్‌కు ఆదిద్రావిడ శాఖ, అగ్నిమాపక, మైనారిటీ వ్యవహారాల శాఖలను కేటాయించారు. అదేవిధంగా మంత్రిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసినా ఎలాంటి శాఖ కేటాయించకుండా రిజర్వులో ఉంచిన పీఆర్ఎన్ తిరుమురుగన్‌కు సివిల్ సప్లయిస్, వినియోగదారుల వ్యవహారాలు, హౌసింగ్, ఆర్ట్ అండ్ కల్చర్, స్టాటిస్టిక్స్ శాఖలను అప్పగించారు.

3న లీగల్ లిటరసీ క్యాంపు

అమలాపురం టౌన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనల మేరకు ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అమలాపురంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో లీగల్ లిటరసీ క్యాంపు నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ బుధవారం తెలిపారు. 'మాదక ద్రవ్యాల దుర్వినియోగం, నిర్మూలన, బాధితులకు చట్టపరమైన సేవలు' అనే అంశంపై క్యాంపు జరుగుతుందని పేర్కొన్నారు.

తగ్గుతున్న వరద

అల్లవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో బోడసకుర్రు పల్లిపాలెంలోని మత్స్యకార కాలనీ బుధవారం వరద నుంచి బయటపడింది. కాలనీలో మత్స్యకారుల ఇళ్లన్నీ బురదతో దర్శనమిస్తున్నాయి. ఎగువ నుంచి వస్తున్న వరద తీవ్రత తగ్గినా బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని కంసాలమామిడి, గౌతమినగర్ కాలనీల్లోని పలు ఇళ్లు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. పూర్తి స్థాయిలో ముంపు తగ్గేందుకు మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఐ.పోలవరం: ఎగువన వరద తగ్గుముఖం పట్టడంతో గౌతమి, వృద్ధ గౌతమి నదీపాయల్లో వరద ఉధృతి తగ్గింది. మురమళ్ల రాఘవేంద్ర వారధి, యానాం ఎదుర్లంక వంతెనల వద్ద వరద ఉధృతి నెమ్మదించింది. దీంతో మురమళ్ల, కేశనకుర్రు, గుత్తెనదీవి, ఎదుర్లంక, పాత ఇంజరం, కొమరిగిరి, పశువుల్లంక గ్రామాలు తేరుకుంటున్నాయి.



సాకుర్రులో వరద బాధితులకు బియ్యం అందిస్తున్న సర్పంచ్ చిరంజీవిరావు

వరద బాధితులకు బియ్యం పంపిణీ

అమలాపురం రూరల్: మండలంలోని సాకుర్రు గ్రామంలో వరద ముంపు బాధితులకు ప్రభుత్వం అందించిన 25 కేజీల బియ్యం, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలను వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ గుత్తుల చిరంజీవి రావు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చొల్లంగి సాయిబాబా, బూత్ కమిటీ అధ్యక్షుడు ముత్తాబత్తుల రమణ, పంచాయతీ కార్యదర్శి రామశైలజ, గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారు వెంకన్న, గ్రామ కమిటీ సెక్రటరీ పోలమూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు సేవలు అభినందనీయం



లక్ష్మణరావు దంపతులను సత్కరిస్తున్న పంచాయతీరాజ్ జిల్లా అధికారి చంటిబాబు తదితరులు

అమలాపురం టౌన్: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో 44 ఏళ్ల పాటు టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేసిన లక్ష్మణరావు సేవలు అభినందనీయమని జిల్లా పంచాయతీరాజ్ అధికారి కె.చంటిబాబు అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మణరావుకు బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ అమలాపురం పీఆర్ సబ్ డివిజన్‌లో ఏ చిన్న సాంకేతిక సమస్య రాకుండా టెండర్లను సకాలంలో అప్‌లోడ్ చేసి అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేశారంటూ కొనియాడారు. అనంతరం లక్ష్మణరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో డీఈఈ రాంబాబు, పీఆర్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడి రమణ, ఏఈఈలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో ఉపాధ్యాయులను నియమించాలి

యానాం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో కొన్ని సబ్జెక్టులకు సంబంధించి టీచర్స్ కొరత ఉండటంతో తమ పిల్లల చదువుకు ఇబ్బంది కలుగుతుందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం ఇంగ్లిష్, సైన్స్, హిందీ టీచర్ల నియామకం జరగలేదన్నారు. ఈ సమస్యను ఆదివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో తాము నవోదయ యాజమాన్యానికి తెలియజేశామన్నారు. గురువారం నుంచి యూనిట్-2 ప్రారంభం కానుందని తమ పిల్లలు పరీక్షలు ఏ విధంగా రాస్తారని ప్రశ్నించారు. అదేవిధంగా విద్యాలయ రక్షణ గోడ కూలిపోయిందని దాన్ని సైతం పునర్నిర్మించాలని కోరామన్నారు.

ఆర్థికాభివృద్ధి దిశగా పుదుచ్చేరి



పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎల్జీ రాధాకృష్ణన్

యానాం: గతంతో పోలిస్తే పుదుచ్చేరి ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తుందని ఎల్జీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. బుధవారం బడ్జెట్ సమావేశం స్పీకర్ ఆర్ సెల్వం అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23తో పోలిస్తే 2023–24లో పుదుచ్చేరి జీఎస్‌డీపీ(స్థూల రాష్ట్ర ఉత్పత్తి)లో వృద్ధి నమోదైందన్నారు. 2023–24 పుదుచ్చేరి జీఎస్‌డీపీ రూ.48,052 కోట్లుగా అంచనా వేస్తున్నామని, ఇది గతేడాది కంటే అధికమన్నారు. పెన్షనర్స్ ఎరియర్స్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో టీచింగ్ స్టాఫ్‌కు 7వ వేతన సంఘ సిఫార్సులను అమలు చేయడానికి రూ.271 కోట్లు అదనంగా మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గతేడాది వివిధ శాఖల్లో 1,119 పోస్టులను భర్తీ చేశామన్నారు. కేంద్ర బడ్జెట్‌లో పుదుచ్చేరికి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష నేత ఆర్.శివ నేతృత్వంలో డీఎంకే, కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు గవర్నర్ ప్రసంగాన్ని పట్టించుకోకుండా వాకౌట్ చేశారు. సమావేశంలో సీఎం రంగసామి, మంత్రులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన వైద్యం



శస్త్ర చికిత్స చేసిన వైద్యులను అభినందిస్తున్న సూపరింటెండెంట్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఓ రోగికి అరుదైన వైద్యం చేసి ప్రాణాలు నిలిపారు. అంతర్వేది మండలం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ కొద్ది రోజుల క్రితం జ్వరం, ఫిట్స్‌తో రాజమహేంద్రవరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరారు. అక్కడి వైద్యుల ప్రయత్నం ఫలించకపోవడంతో ఆమె జీజీహెచ్‌లో చేరారు. సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి ఆధ్వర్యంలో న్యూరో సర్జరీ ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ ఎస్ఎం షరీఫ్, డాక్టర్ రవితేజ ఆమెకు పోస్ట్ వైరల్ 'సూపర్ రిఫ్రాక్టరీ స్టేటస్ ఎపిలెప్టికస్' అనే వ్యాధిగా నిర్ధారించి ఖరీదైన ఐవీ, ఐజీలతో వైద్యం అందించారు. ఆరోగ్య శ్రీ ఉండడంతో ఆమెకు నిరాటంకంగా వైద్యం అంది ప్రాణాపాయం నుంచి బయటపడింది.

జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి



ఆలమూరులో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న ఆర్జేడీ శారద

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఇంటర్మీడియేట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో సమస్యలు, విద్యార్థుల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న రెండు అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల యాజమాన్యం సమకూర్చిన పాఠ్య పుస్తకాలను ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అందజేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్జేడీ శారదకు అభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారు. కమిటీ ప్రతినిధులు గారపాటి త్రిమూర్తులు, గుణ్ణం వీర్రాజు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఎస్‌వీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉండాలి



లూటుకుర్రు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర

మామిడికుదురు: గోదావరి తీర గ్రామాల్లో పాముల బెడద తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పాము కాటు విరుగుడు ఇంజెక్షన్లు (ఏఎస్‌వీ) అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర సూచించారు. బుధవారం లూటుకుర్రు పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేశారు. ఏఎస్‌వీ వివరాలు తెలుసుకున్నారు. గోదావరి వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలని సూచించారు. గర్భిణుల వివరాలను విధిగా నమోదు చేయాలన్నారు. వారికి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, డయేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్యశైలజ పాల్గొన్నారు.

వీఆర్వో పీవీకి ఘన సత్కారం



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న రెవెన్యూ అధికారులు

అల్లవరం: కొమరిగిరిపట్నం గ్రామ రెవెన్యూ అధికారి విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ చేసిన పెనుమాల వెంకటేశ్వరరావు(పీవీ)ను రెవెన్యూ అధికారులు బుధవారం ఘనంగా సత్కరించారు. అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీల్‌కుమార్ అధ్యక్షతన వెంకటేశ్వరరావుకు వీడ్కోలు సభ నిర్వహించారు. రెవెన్యూ శాఖలో వివిధ స్థాయిల్లో 38 ఏళ్ల పాటు అంకిత భావంతో పనిచేశారంటూ పలువురు అధికారులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్లు పాము సుబ్బారావు, వడ్డి సత్యవతి, అప్పారావు, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుణిశెట్టి చినబాబు, ఎంపీటీసీ పి.వెంకటేశ్వర్లు, ఆర్ఐ దుర్గాశ్రీనివాస్, కడలి రామకృష్ణ, గుర్రం ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

20 వరకూ ఇంటర్ అడ్మిషన్లు

అమలాపురం టౌన్: ఇంటర్మీడియెట్ అడ్మిషన్లకు ఈ నెల 20 వరకూ గడువును పొడిగించారని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈవో) వనుము సోమశేఖరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. జూలై 31వ తేదీతో జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసినప్పటికీ దానిని పొడిగిస్తూ ఇంటర్మీడియెట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మేలైన వరి పంటకు ధ్రువీకరణ



ఇరుసుమండలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాజశేఖర్

అంబాజీపేట: తక్కువ మొత్తంలో ఎరువులు, పురుగు మందులు వాడిన వరి పంటకు ధ్రువీకరణ పత్రం ఇవ్వడంతో పాటు మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్ రైతులకు వివరించారు. ఇరుసుమండలో పొలంబడి కార్యక్రమాన్ని ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ మేలైన వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంటలను పొలంబడిలో ధ్రువీకరిస్తామన్నారు. పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం ద్వారా పంటల దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం వరిలో విత్తనశుద్ధి, పురుగు మందులతో విష ప్రభావంపై రైతులకు బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహించారు. అలాగే కలుపు మందు, నీటి యాజమాన్యం, సేంద్రియ పద్ధతులతో జీవామృతం తయారీని వివరించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది జె.నాగవేణి, ఏఈఓ డి.దుర్గారావు పాల్గొన్నారు.